డిటెక్టివ్ స్పెషల్

# అదృశ్యమైన అనామకుడు

## కొమ్మూరి సాంబశివరావు



తాతలనాటి గడియారం పన్నెండుగంటలు కొట్టింది. గోవర్ధనరావు అటకమీదనించి యింకో పెట్టె దింపి, తెరిచాడు.

"అర్ధరాత్రి యింకా ఆ గదిలో ఏం చేస్తున్నారు? పడుకోండి!" అన్నది అవతల గదిలోంచి గోవర్ధనరావు భార్య శకుంతల.

"నాలుగు రోజుల్లో యిల్లు ఖాళీ చెయ్యాలి. మనం వెళ్ళేది చిన్న అద్దెకొంపకి. చెత్తసామానంతా...." అని గొణిగాడు. పెట్టెలో కాయితాలు, ఫోటోలు, కట్టల కట్టల ఉత్తరాలు,

జమా ఖర్చుల పుస్తకాలు—ఓపికగా, ఒక్కొక్కటీ పరీక్షగా చూసి; చదివి, అవసరం అనుకున్నవి ఒకపక్కగా పెడుతూ, మిగతావి అవతల పడేస్తున్నాడు గోవర్ధనరావు. అతని తండ్రి చలపతిరావు బాగా ప్రాక్టీసున్న వకీలు. మహాత్మాగాంధీజీ స్వాతంత్ర్య వుద్యమం నినాదం విన్నాక, వృత్తి మానేసి, స్వాతంత్ర సమరంలోకి దూకాడు. ఎన్నోసార్లు జైలుకి వెళ్ళాడు. ఆదాయం లేకపోవటంవల్ల, దాచుకున్న డబ్బు కాంగ్రెసు పార్టీకి విచ్చలవిడిగా వ్యయం చేయటంవల్ల అప్పులపాలయ్యాడు. దేశానికి స్వాతంత్రం వచ్చేనాటికి, చలపతిరావుకి యాభయి ఏళ్ళుకూడా లేవు. ఎం. ఎల్. ఏ.గా నిలబడమని అడిగినపుడు; ఎం. పి.గా నిలబడమని పార్టీ నాయకులు అడిగినపుడు; అతని త్యాగానికి అయిదు ఎకరాలు భూమి యిస్తామని ప్రభుత్వం వుత్తరం వ్రాసినపుడు, చలపతిరావు సమాధానం ఒక్కటే. "దేశానికి నేను ఏదో సేవ చేస్తున్నాననీ; యీ సేవకి ప్రత్యుపకారంగా, వడ్డీతో సహా నాకు ఏదో వస్తుందనీ చెయ్యలేదు. అది నా విధి. నా ధర్మం. అందుకని చేశాను. ప్రతిఫలం ఆశించి కాదు. నాకు వద్దు" అని పార్టీ నాయకులకి వుత్తరాలు వ్రాశాడు. ఆ వుత్తరాల కాపీలు; పార్టీ నాయకులు వ్రాసిన ఉత్తరాలు అన్నీ ఆ పెట్టెలో వున్నాయి. మహాత్మాగాంధీజీ, నెహ్రూ, తదితర నాయకులతో తన తండ్రి తీసుకున్న ఫోటోలు జాగ్రత్తగా పక్కనపెడుతున్నపుడు, గోవర్ధనరావు కళ్లు చెమ్మగిల్లాయి. స్వార్ధరాహిత్యంతో స్వరాజ్య సమయంలో యోధుడయిన తన తండ్రి, తనకి ఎన్నిసార్లు,

"గోవర్ధనం—ఒక్క విషయం జ్ఞాపకముంచుకో! నేను పోయిన తర్వాతకూడా, ఎప్పుడూ—ఎటువంటి కష్టసమయంలోను, నా పేరుకానీ, నా దేశసేవకానీ, వుపయోగించుకుని నువ్వు ధనరూపేణకానీ, యింకేవిధంగా కానీ, లాభం పొందకూడదు. తెలిసిందా?" అని చెప్పేవాడు. తను తల వూపి "సరే నాన్నా!" అనేవాడు. ఆనాటి నైతిక విలువలూ; ధర్మ ప్రవర్తనా; యీనాటి రాజకీయవేత్తలతో పోలిస్తే—నవ్వుకున్నాడు గోవర్ధనరావు. ఆ పెట్టె మూసేసి, అటకమీదనించి యింకోపెట్టె దింపాడు. బాగా తుప్పుపట్టింది. అతి కష్టం మీద తెరిచాడు.

అది గోవర్ధనరావు తాతగారు శేషయ్యగారిది. ఆ పెట్టెలో పుస్తకాలు, డైరీలు, వుత్తరాలు, ఫోటోలు, తీస్తుంటే చిన్నప్పటి విషయాలు ఎన్నెన్నో జ్ఞాపకం వస్తున్నాయి గోవర్ధనరావుకి.

తాతగారికీ, తన తండ్రికీ జరిగిన వాగ్వివాదాలు తనింకా మర్చిపోలేదు. శేషయ్యగారు డిప్యూటీ కలెక్టర్. బ్రిటిష్ ప్రభుత్వం, సామ్రాజ్యానికి చేసిన సేవకి సంతోషించి తన తాతగారికి "రావు బహదూర్" బిరుదుకూడా యిచ్చింది.

బ్రిటిష్ సామ్రాజ్య వుద్యోగులలో ఒక్కడయిన తన తాతగారు—ఆ సామ్రాజ్యాన్ని యెదిరిస్తున్న తన తండ్రీ—యిద్దరూ వాళ్ళ నమ్మకాలనుబట్టి వాళ్ళ బతుకులు బతికేవారు. "బ్రిటిష్‌వాళ్ళే మన దేశానికి రాకపోతే అసలు భారతదేశం, అంతా ఒక దేశంగా యెలా వుండేదిరా! చిన్న చిన్న రాజ్యాలుగా...."

"బ్రిటిష్‌వారు మన దేశానికి వుపకారమే చేశారో, అపకారమే చేశారో, అది అప్రస్తుతం. ఇప్పుడు మన దేశాన్ని మనం పాలించుకోగలం. ఇంకొకరికి బానిసగా వుండవలసిన అవసరంలేదు."

"ఈ కాంగ్రెసువాళ్ళ మాటలు విని చెడిపోతున్నావు. ప్రాక్టీసు మానేశావు. ఆఖరికి బికారివి అయి—"

"ముష్టి ఎత్తుకుంటానంటావు. ఆ అవసరం వుండదు. నీ ప్రభుత్వ జైలుందిగా అందులో తిండి పెడతారు."

ఇలా జరిగేవి ఆ తండ్రీ కొడుకుల పోట్లాటలు. చలపతిరావు కాంగ్రెసు వాలంటీర్ల వూరేగింపుకి నాయకుడిగా వెళుతున్నపుడు, డిప్యూటీ కలెక్టరయిన శేషయ్యగారు, ఆ వూరేగింపు మీద ముందు, లాఠీచార్జి, తర్వాత, తుపాకి కాల్పులు జరిపించడం—అప్పుడు ఆ తండ్రీ

కొడుకులు ఒకర్ని ఒకరు నడివీధిలో వేలాది ప్రజల ముందర యెదిరించడం—అదంతా ఓ కథ.

"షూట్!" అని ఆజ్ఞ యిచ్చాడు పోలీస్ సూపరింటెండెంటుకి.

తుపాకీలు ఎత్తారు. గురిపెడుతున్నారు. మొదటి వరుసలో, త్రివర్ణ పతాకం పట్టుకుని నిల్చుని వున్న తన కొడుకు ఒక్కడే ఒక్క కొడుకు, చలపతిని చూశాడు.

ఏం చెయ్యాలి? నా కొడుకు ప్రాణం రక్షించడంకోసం షూట్ అన్న ఆజ్ఞని వుపసంహరించుకోవాలా? నా ఉద్యోగ ధర్మం నేను నిర్వహించాలా! భగవంతుడా యిటువంటి సంధిగ్ద పరిస్థితి ఏ తండ్రికీ కలుగకూడదు అనుకున్నాడు ఆయన.

గోవర్ధనరావు తాతగారి డైరీ చదువుతున్నాడు. నవ్వుకున్నాడు.

అటువంటి పరిస్థితి చరిత్రలో ఎన్నోసార్లు జరిగింది—ముందు ముందు జరుగుతుంది. ఒక తరానికీ యింకో తరానికీ తండ్రీ కొడుకులు నాయకులు అయినపుడు. చటుక్కున ఆగాడు చదువుతున్నవాడు. తన కళ్ళని తనే నమ్మలేక పోతున్నాడు. అదే డైరీలో వున్న ఫోటోని చూశాడు, యింకోఫొటో—యింకా వివరాలు.

"నిజమా! నిజమేనా! ఎంత మోసం! ఎంత ధైర్యం!" అనుకుంటూ చదువుతున్నాడు.

"అయ్యయ్యో! అసలు నిద్రపోలేదా! తెల్లారింది. పాలు కూడా వచ్చేశాయి. ఏం చేస్తున్నాడు?" అంటూ శకుంతల వచ్చింది. గోవర్ధనరావు పెట్టె మూసేసి, తాళంవేసి, "అయితే కాఫీ చెయ్యి. ఆలోగా నేను మొహం కడుక్కుంటాను" అన్నాడు.

*　　　　*　　　　*

"కూర్చోండి! స్వామినాధుల శకుంతల గారా! ఇంటిపేరు. మీరు చెప్పకండి! జ్ఞాపకం చేసుకుంటాను. స్వామినాధుల చలపతిరావు గారు—స్వాతంత్ర వుద్యమంలో ప్రముఖ నాయకుడు—ఆయన మీకేమవుతారు?" అడిగాడు డిటెక్టివ్ యుగంధర్.

"మామగారు. మావారి పేరు, స్వామినాధుల గోవర్ధనంగారు. అనాధుల హైస్కూలులో టీచరు మావారు" అన్నది శకుంతల.


ఆమె మొహం పీక్కుపోయింది. జుట్టు కూడా సరిగా దువ్వుకోలేదు.

"చెప్పండమ్మా! నావల్ల మీకు ఏం సహాయం కావాలి?" అడిగాడు యుగంధర్.

"మామగారు బతికున్న రోజుల్లోనే యింటి మీద అప్పు తీసుకున్నారు. మావారికి వచ్చే జీతంలో యిల్లు గడవడమే కష్టం. ఇక అప్పు ఎక్కడ తీర్చగలం? మాకు యిద్దరు పిల్లలు. అసలూ, వడ్డీ కలసి, ఎక్కువయి యిల్లు వేలానికి వచ్చింది. వేలం వెయ్యనవసరంలేదనీ, యిల్లు తీసేసుకోమనీ, అప్పు యిచ్చిన ఆయనకి మావారు చెప్పారు. ఒక చిన్న అద్దెయిల్లు స్కూలుకి దగ్గిరగా తీసుకున్నారు. మొదటి తేదీకి యిల్లు ఖాళీచేస్తామన్నాము. అందుకని, అనవసరమైన వస్తువులు—తాతలనాటివి అటకలమీదా, అలమారుల్లో వున్నవీ, అన్నీ పారెయ్యాలని మా వారు అన్నీ తనిఖీ చేస్తున్నారు.''

"ఎప్పుడూ?'' అడిగాడు యుగంధర్.

"అయిదురోజులయింది. ఆ రాత్రి అంతా అటకమీద వున్న పెట్టలని దింపి, తనిఖీ చేస్తూ అసలు నిద్రేపోలేదు. తెల్లారిన తర్వాత మొహం కడుక్కుని, కాఫీ తాగి, బయటికి బయలుదేరారు. 'ఎక్కడికి?' అని అడిగాను? ముఖ్యమంత్రిని చూడటానికి అన్నారు. 'నిజం చెప్పండి!' అన్నాను. 'నిజమే చెపుతున్నాను' అని ఒక రిక్షా తీసుకువచ్చి అందులో ఒక పాత పెట్టె పెట్టుకుని వెళ్ళిపోయారు. ఎప్పుడూ, ఏ మంత్రినికానీ, ఏ వుద్యోగినికాని, ఏదీ అడగని మావారు, ముఖ్యమంత్రిని కలుసుకోవడానికి, ఒక పెట్టె తీసుకుని వెళుతున్నారంటే నమ్మలేకపోయాను. ఏదో ఆతురతలో వున్న ఆయన్ని ప్రశ్నలతో—వేధించడం యిష్టం లేక, నేను వూరుకున్నాను. ఆ రోజంతా ఆయన తిరిగి రాలేదు" అని ఏడ్వటం ప్రారంభించింది శకుంతల; ముతక ఖద్దరు చీరకొంగుతో కళ్లు తుడుచుకుంటూ.




"ఎప్పుడు తిరిగివచ్చారు?" అడిగాడు యుగంధర్.

"అసలు తిరిగిరాలేదు. ఆ రాత్రి అంతా కన్ను మూయ్యకుండా కాచుకున్నాను. మర్నాడూ రాలేదు. తర్వాత పోలీస్ కంప్లయింట్ యిచ్చాను."

"పోలీసులు దర్యాప్తు చేసి ఏమైనా తెలుసుకున్నారా?"

"లేదండీ. ఈ నాలుగురోజులూ, రోజూ, పదిసార్లు పోలీసుస్టేషనుకి వెళ్ళి అడుగుతూనే వున్నాను. ఇంకా ఏమీ తెలియలేదనీ, తెలియగానే చెప్తామనీ అంటారు. అంతే! నా దగ్గిర డబ్బులేదు. బీదవాళ్ళం. మా మాటకి విలువ ఎవరు యిస్తారు. నేను ఏ కార్లోనో పోలీస్ స్టేషన్ ముందు దిగితే—"

"మీరెవరో—మీ మామగారు ఎవరో—మీవారు ముఖ్యమంత్రిని కలుసుకోవడానికి వెళ్ళారనీ—యివన్నీ మీరు పోలీసులకి చెప్పలేదా?" అడిగాడు యుగంధర్ అసిస్టెంటు రాజు.

"చెప్పానండీ! అంతా చెప్పాను. ఆఖరికి మా మామగారి తండ్రి రావుబహదూర్ శేషయ్యగారి పేరుకూడా చెప్పాను. పోలీసులు ఎక్కువగా పట్టించుకోవడంలేదు. ఎవరో బీద స్కూలు టీచరు, ఏమయితేనేం అనే వుపేక్ష. మీకూ నేను ఏమీ యిచ్చుకోలేను - మీ పాదాలకి నమస్కారం పెట్టటం తప్ప. ధనం ప్రధానం కాదనీ, న్యాయమూ, ధర్మమూ, నీతీ, మీకు ప్రధానమనీ అందరూ చెప్పుకోగా విన్నాను. దయచేసి, మావారు—" అని మళ్ళీ ఏడ్వడం ప్రారంభించింది శకుంతల. కాత్యా వేడి కాఫీ తెచ్చి బల్లమీద పెట్టి, "తాగండి!" అన్నది.

"అమ్మా! దేశంకోసం సర్వమూ త్యజించి, ఏ ప్రతిఫలమూ, కోరని మీ మామగారు చలపతిరావుగారు; తండ్రి పేరుప్రతిష్ఠలని వుపయోగించుకోకుండా, ఒక అనామకుడిగా—బ్రతుకు భారం మోస్తున్న మీ భర్త గోవర్ధనంగారూ, యిలాటివారు చాలా అరుదు. మీరు నాకు ఏమీ యివ్వనవసరంలేదు. గోవర్ధనంగారు ఏమయ్యారో తెలుసుకోవడం—మీ కుటుంబానికి సేవచెయ్యడం నా భాగ్యం" అన్నాడు యుగంధర్.

* * *

"రండి యుగంధర్! ఏమిటి యిలా వచ్చారు?" అడిగారు ముఖ్యమంత్రి ప్రతాప

రావు బట్టతలమీద వున్న గాంధీ టోపీ తీసి, సర్దుకుని మళ్ళీ పెట్టుకుంటూ. డబ్బయి ఏళ్ళ పైన వున్నాయి.

"స్వామినాధుల చలపతిరావుగారి పేరు మీకు జ్ఞాపకం వుందా?" అడిగాడు యుగంధర్.

"అయ్యయ్యో! ఆయన్ని ఎలా మర్చిపోతాం! ఉత్తమోత్తముడు."

"ఆయన కుమారుడు గోవర్ధనరావు—"

"అవును. స్కూలుటీచరునని చెప్పాడు! చాలా యిబ్బందులలో వున్నాననీ, యిల్లు వేలం వేస్తున్నారనీ—సహాయం కావాలనీ అడిగాడు."

"ఊ!"

"నేను అప్పుడు చాలా తొందరలో వున్నాను. అత్యవసర క్యాబినెట్ మీటింగ్ వుంది. చలపతిరావుగారి కొడుకు దరిద్రంతో వీధులపాలవుతున్నాడంటే నాకెంతో కష్టమనిపించి, మర్నాడు పొద్దునరమ్మనీ, పార్టీ నిధిలోంచి, డబ్బు తీసుకుని యివ్వగలనని చెప్పాను. ప్రభుత్వం డబ్బు ఎలా యివ్వగలను చెప్పండి!"

"గోవర్ధనరావు—"

"థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. మూడు రోజుల క్రితం పోలీసు కమిషనర్ నన్ను గోవర్ధనరావు గురించి అడిగాడు. ఇదే విషయం చెప్పాను. ఏమైంది....?" అడిగాడు ముఖ్యమంత్రి.

"అప్పటినించీ గోవర్ధనరావు జాడలేదు. మీ దగ్గిరికి వస్తున్నానని చెప్పి వెళ్ళిన మనిషి మళ్ళీ యింటికి రానేలేదుట."

"పాపం! సహాయం చెయ్యడం యిష్టం లేకనే నేను తప్పించుకునేందుకు అలా అన్నానని గోవర్ధనరావు అనుకోలేదుకదా! నిస్పృహతో ఏ దారుణానికీ పూనుకోలేదు కదా!"

"అదే తెలియదు. గోవర్ధనరావుని గురించి మీకు యింకా ఏమైనా తెలుసా?" అడిగాడు యుగంధర్.

"అబ్బే! అదే అతన్ని మొదటిసారి చూడడం" అంటూ చేతిగడియారం చూసుకున్నాడు. అంటే యిక వెళ్ళమని సంజ్ఞ.

యుగంధర్ లేచాడు. "గోవర్ధనరావు కన్పిస్తే చెప్పండి - డబ్బు విషయం బెంగపడవద్దని" చెప్పాడు ముఖ్యమంత్రి.

* * *

"హల్లో మిస్టర్ యుగంధర్. కూడా నీడలా వుండే రాజు రాలేదా? ఏమిటి విశేషం?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు. యుగంధర్ చెప్పాడు.

"యస్. యస్. డి. 13 స్టేషన్‌లో కంప్లెయింట్ యిచ్చింది ఆమె. క్రయిమ్ బ్రాంచికి కేసు ట్రాన్స్‌ఫర్ అయింది మొన్న. నేనే యిన్‌చార్జి. దర్యాప్తు చేస్తున్నాను." అన్నాడు స్వరాజ్యరావు.

"ఇప్పటికి ఏం తేలింది?" అడిగాడు యుగంధర్.

"గోవర్ధనరావు ఎక్కిన రిక్షా అతన్ని పట్టుకున్నాము. సదరన్ బాంక్‌కి ఒక పెట్టెతోసహా గోవర్ధనరావు వెళ్ళాడనీ రిక్షా అతనికి డబ్బుయిచ్చి పంపేశాడనీ తెలిసింది. ఒక బరువైన తుప్పుపట్టిన పెట్టెని గోవర్ధనరావు బాంకిలో సేఫ్ కస్టడీలో పెట్టి వెళ్ళిపోయాడనీ తెలిసింది. కాలి నడకన వెళ్ళాడో, ఎందులో వెళ్ళాడో తెలియదుకాని, తర్వాత ముఖ్యమంత్రిని కలుసుకుని, ధన సహాయం కోరాడనీ తెలిసింది. మళ్ళీ మంత్రి యింట్లోంచి బయటికి వెళ్ళిన మనిషి-ఏమయ్యాడో, తర్వాత జాడలేదు - గాలిలో మాయమైనట్లు." అన్నాడు స్వరాజ్యరావు.

"బాంకిలో గోవర్ధనరావు పెట్టిన పెట్టె ఏమైంది?"

"అక్కడే వుంది. ఆ పెట్టెలో వస్తువులని బట్టి అతని జాడలు తెలుస్తాయేమోనని, ఆ పెట్టె తెరిచి చూశాము. ఆ పెట్టెలో చీపురు పుల్ల కూడా లేదు."

"ఖాళీ తుప్పుపట్టిన పెట్టెను గోవర్ధనరావు అంత జాగ్రత్తగా పెట్టాడంటే వింతగా లేదూ. బరువైన పెట్టె అని రిక్షా అతను చెప్పాడు కదా!"

"అవును. ముఖ్యమంత్రి, కమిషనర్‌కి, కమిషనర్ నాకు ఫోన్‌చేసి అడిగారు పెట్టెలో

ఏమున్నాయని? వాళ్ళు ఆశ్చర్యపోయారు?" అన్నాడు స్వరాజ్యరావు.

"బాంకిలో గోవర్ధనరావు పెట్టె పెట్టిన తర్వాత, అది తెరిచి, అందులో వస్తువులు ఎవరో అపహరించి వుండడానికి అవకాశం వుందా?" అడిగాడు యుగంధర్.

స్వరాజ్యరావు రెండు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించి, "అదే నా అనుమానమూ! పెట్టె తాళం; ఏ దబ్బనంతోనో తీసినట్టు గుర్తు లున్నాయి. అంతేకాదు, గోవర్ధనరావు పెట్టె బాంకిలో పెట్టిన రాత్రి, ఆ బాంకిలో దొంగ పడ్డాడు. డబ్బు ఏమీ పోలేదు" అన్నాడు స్వరాజ్యరావు.

"థాంక్స్! గోవర్ధనరావు భార్య శకుంతలా దేవి నా సహాయం కోరింది. మీ దర్యాప్తులో ఏమైనా విశేషాలు తెలిసినా! గోవర్ధనరావు దొరికినా దయచేసి వెంటనే నాకు ఫోన్ చెయ్యండి!" అన్నాడు యుగంధర్.

* * *

"పైకి కనిపిస్తున్నంత సులభమైన కేసు కాదు యిది." అన్నాడు యుగంధర్ రాజుతో.

"అంటే?" అడిగాడు రాజు.

"ఏనాడు, ఎవర్నీ ఏమీ అడగని గోవర్ధన రావు ముఖ్యమంత్రిని ధన సహాయంకోసం కలుసుకున్నాడంటే అది గోవర్ధనరావు నైజానికి విరుద్ధంగా వుంది. బాంకిలో గోవర్ధనరావు కాళీపెట్ట పెట్టలేదని తెలుస్తోనే వుంది. బాంకిలో ఆ రాత్రి దొంగలు పడడం—డబ్బు ఏమీ తీసుకోకపోవడం కూడా వింతగా వుంది. ఆ దొంగలు గోవర్ధనరావు పెట్టిన పెట్టెలో వస్తువులు తీసుకున్నారని మనం వూహించడంలో తప్పు లేదు అనుకుంటాను" అన్నాడు యుగంధర్.

"ముఖ్యమంత్రి యింటినించి బయలుదేరిన గోవర్ధనరావు ఏమైనట్టు?" అడిగాడు రాజు.

"అది తెలిస్తే కేసే పూర్తవుతుంది. అతను పెట్టిన పెట్టెలో ఏముందో తెలుసుకోవాలి ముందు" అన్నాడు యుగంధర్.

* * *

యుగంధరు, రాజూ, సదరన్ బేంకుకి వెళ్లారే కాని కొత్త విషయాలు ఏమీ తెలియ లేదు. సైకిల్‌రిక్షా అతన్ని కలుసుకుని, తరచి, తరచి ప్రశ్నలు అడిగారు—ప్రయోజనం లేక పోయింది.

"రాజూ! గోవర్ధనరావు యింటికి వెళ్ళి అతని ఫొటో ఒకటి తెచ్చుకో. తర్వాత ఆ ఫొటో, ముఖ్యమంత్రి యింటిముందు కాపలా వుండే జవానుకి చూపించు. ఏమైనా తెలుస్తుం దేమో కనుక్కో!" అని రాజుకి చెప్పి, తర్వాత కాత్యాని పిలిచి, "ఊళ్ళో ఉన్న అన్ని బేంకు లకీ వెళ్ళు. ఏ ఒక్క బేంకునీ వొదిలిపెట్టక. గోవర్ధనరావు ఏ బేంకులోనైనా ఏ పెట్టో ఏ వస్తువో దాచాడేమో తెలుసుకో" చెప్పాడు యుగంధర్.

* * *

"క్షమించండి యుగంధర్! మీరు కోరిన పని చెయ్యలేను. చెయ్యడానికి అధికారాలూ లేవు. అంతేకాదు. అంతటి తీవ్ర చర్యకి ఆధారమూ లేదు" అన్నాడు కమిషనర్ ఆఫ్ పోలీస్.

"ముఖ్యమంత్రి పదవినిబట్టి మీరు భయ పడుతున్నారు కాని, ఆధారము లేదు అని అన కండి. గోవర్ధనరావు ముఖ్యమంత్రి యింటికి వెళ్ళినట్లు నిదర్శనం వుంది. ముఖ్యమంత్రే వొప్పుకున్నారు. కాని గోవర్ధనరావు ఆ యింట్లోంచి బయటికి వచ్చినట్లు నిదర్శనం లేదు."

"గోవర్ధనరావు లాటి వాళ్ళు బయటికి వెళ్ళడం ఎవరూ జ్ఞాపకం పెట్టుకోరు. జ్ఞాప కమూ వుండదు—ముఖ్యమంత్రి యింట్లోంచి గోవర్ధనరావు బయటికివెళ్ళలేదని తెలిస్తేకాని- అంతేకాదు—గోవర్ధనరావుని అక్కడే బల వంతంగా వుంచేయడానికి తగిన కారణంవున్న దని నిర్ధారణ అయితేకాని—"

"ఆల్‌రైట్! ఎనివే థాంక్‌యు" అన్నాడు యుగంధర్.

"మిస్టర్ యుగంధర్! జాగ్రత్త! ముఖ్య మంత్రి అవసరమైనపుడు చాలా కఠినంగా

వుండగలరు" అన్నాడు పోలీసు కమిషనర్.

* ♦ *

గోవర్ధనరావు ఫోటో సంపాదించి, తీసు కెళ్ళి, ముఖ్యమంత్రి యింటిముందు కాపలా వుండే యిద్దరు పోలీసు కాన్‌స్టేబుల్సుకి చూపించి అడిగానని, రెండు గంటల తరవాత రాజు వచ్చి చెప్పాడు యుగంధర్‌కి.

"ఏమన్నారు?" అడిగాడు యుగంధర్.

"గోవర్ధనరావు కాలినడకనే వచ్చాడుట. ముఖ్యమంత్రిని కలుసుకోవాలని చెపితే ఆ కాపలాదారు వెళ్లనివ్వలేదుట. అప్పుడు కాయితంమీద తన పేరు, తన తండ్రి పేరు, తన తాత రావుబహదూర్ శేషయ్యగారి పేరు వ్రాసి, ముఖ్యమంత్రికి యివ్వమన్నాట్ట గోవర్ధనరావు. ఆ చీటీ లోపలికి పంపించిన వెంటనే ముఖ్యమంత్రి ప్రతాపరావు, గోవర్ధనరావుని లోపలికి పంపించమని అనుమతి యిచ్చారట."

"తరవాత?" యుగంధర్ అడిగాడు.

"గోవర్ధనరావు తిరిగి వెళ్లటం కాపలా వున్న పోలీసు జవాన్లు చూడలేదుట. గోవర్ధనరావు బయటికి వెళ్ళలేదని వాళ్లు నిశ్చయంగా చెప్పలేకుండా వున్నారు. లోపలికి వెళ్ళేవాళ్ళ విషయమే ఆ జవానులు ఎక్కువగా పట్టించుకుంటారుగాని, బయటికి వెళ్ళేవాళ్ల విషయం అట్టే గమనించరుట" అంటూ రాజు చిన్న నవ్వు నవ్వాడు.

"ఏమిటి రాజూ! ఇంకేదో ముఖ్యమైన విషయం తెలుసుకొన్నట్టున్నావు?" అడిగాడు యుగంధర్.

రాజు తల వూపి, "బాంక్‌లో దొంగతనం విషయం—క్షమించండి. మీరు చెప్పిందే—" అంటున్నాడు రాజు.

"ఊఁ! ఏమిటి?" పురమాయించాడు యుగంధర్.

"గజదొంగ పెరుమాళ్—బాంక్ దొంగతనాలలో ఆరితేరినవాడు జ్ఞాపకం వున్నాడా?"

"ఆఁ! జైలునుంచి వచ్చి నాలుగేళ్ళు అయింది. దొంగతనాలు మానేసి; చిన్న కొట్టు ఏదో పెట్టుకొని, పెరుమాళ్ నిజాయితీగా బతుకుతున్నాడుగా" అన్నాడు యుగంధర్.

"అతనిని కలుసుకున్నాను. సదరన్ బాంక్‌లో దొంగతనం చేసినది అతనే, పెరుమాళే" చెప్పాడు రాజు.

"తనేనని ఒప్పుకొన్నాడా? ఎలా ఒప్పించావు?" అడిగాడు యుగంధర్ ఆశ్చర్యంతో.

"మేమిద్దరం తప్ప ఇంకెవరు లేరు. అతను నాతో ఏం చెప్పినా, అది నిరూపించే సాక్ష్యం లేదు అని అతనికి తెలుసు. అందువల్ల గర్వంగా చెప్పాడు. గోవర్ధనరావు ముఖ్యమంత్రి ఇంటికి వెళ్ళిన సాయంకాలం, ఎవరో ఒక మనిషి—మారువేషంలోనే వున్నాడని చెప్పాడు—పెరుమాళ్‌ని కలుసుకొన్నాడు. గోవర్ధనరావుని బాంక్‌లో పెట్టిన పెట్టె గుర్తులు చెప్పి; పెరుమాళ్‌ని సదరన్ బాంక్‌లో ప్రవేశించి మర్నాటికల్లా ఆ పెట్టెలో వస్తువులు తెచ్చి యిమ్మన్నాడట. ఆ మనిషి ఆ పని చేస్తే ఒక లక్షరూపాయలు యిస్తానని చెప్పి పదివేల రూపాయలు అడ్వాన్సు యిచ్చాడుట. అంతే కాదు పోలీసులు ఎక్కువగా పట్టించుకోరనీ-ధైర్యంగా దొంగతనం చేయవచ్చనీ ఆ మనిషి పెరుమాళ్‌కి చెప్పాడుట."

"తరువాత?" అడిగాడు యుగంధర్.

"ఆ రాత్రి పెరుమాళ్ సదరన్ బాంక్‌లో ప్రవేశించాడు. గోవర్ధనరావు పెట్టిన పెట్టె తెరిచి, అందులో వున్న వస్తువులు తెచ్చేశాడు."

"తెచ్చి?"

"ఆ రాత్రంతా తన యింట్లో ఆ వస్తువులు-వస్తువులు కావు—కాగితాలు; చెత్తకాగితాలు; చిరిగిపోయిన కాయితాలు—పాత స్కూలు పుస్తకాలు, అన్నీ పెరుమాళ్ పరీక్షగా చూశాడట. వాటిలో విలువయినది ఏదీ పెరుమాళ్‌కి కనిపించలేదు. మర్నాడు పొద్దున్న మారువేషంలో వున్న ఆ మనిషి రాగానే పెరుమాళ్ ఆ కాయితాలు అతనికి యిచ్చేశాడు. అతను మిగతా తొంభై వేలు పెరుమాళ్‌కి యిచ్చాడు." చెప్పాడు రాజు.

అంతలో కాత్యా తిరిగి వచ్చింది. "సారీ

సర్! గోవర్ధనరావు ఇంక ఏ బాంక్‌లోను ఏ పెట్టె, ఏ వస్తువు పెట్టలేదు" అన్నది.

యుగంధర్ నిట్టూర్చాడు.

"పోలీసులకి తెలియని విషయం ఒకటి తెలుసుకొన్నాను" అన్నది కాత్యా గర్వంగా.

"ఏమిటది?"

"గోవర్ధనరావు సదరన్ బాంక్ నుంచి తిన్నగా ముఖ్యమంత్రి యింటికి వెళ్ళలేదు. మౌంట్‌రోడ్డుకి వెళ్లాడు. అక్కడ ఒక షాపులో ఒక చిన్న బ్రీఫ్‌కేసు కొని, అందులో, ఏవో ఫొటోలు; డైరీలు; కొన్ని కాయితాలు; పెట్టి తాళంవేసి, అక్కణ్ణించి సెంట్రల్‌స్టేషన్‌కి వెళ్లాడు."

"వెళ్ళి?"

"స్టేషన్‌లో ఏం చేసిందీ తెలియదు" అన్నది కాత్యా.

"పోలీసువాళ్ళు యీ వివరాలు ఎందుకు తెలుసుకోలేకపోయారు?" అన్నాడు యుగంధర్.

"ఏమో! సరిగా దర్యాప్తు చేయలేదేమో. సదరన్ బ్యాంక్‌వద్ద ఉన్న బస్సుస్టాప్ వద్ద ఆగి, వచ్చే పోయే బస్సు కండక్టర్ల ద్వారా కనుక్కొన్నాను" అన్నది కాత్యా.

"వెరీగుడ్" అన్నాడు యుగంధర్.

* * *

తలుపు చప్పుడు కాగానే, శకుంతల తలుపు తెరిచి యుగంధర్ని చూసి "రండి! కూర్చోండి! కాఫీ...." అని లోపలికి వెళ్ళిపోతోంది.

"వద్దమ్మా! ఒక ప్రశ్న అడగడానికి వచ్చాను. మీ వారు కనిపించకుండా వెళ్ళిన తరువాత, పోస్ట్‌లో మీ పేర్నకాని, మీ వారి పేర్నకాని, ఏదైనా కవరు వచ్చిందా?" అడిగాడు యుగంధర్.

"ఆ! రిజిస్టర్ పోస్ట్‌లో ఒక కవరు




వచ్చింది. పోస్టుమాన్ తెలిసినవాడు—ఆయన పేర్న వున్నా నా సంతకం తీసుకొని యిచ్చే శాడు." చెప్పింది శకుంతల.

"కవరులో ఏముంది?"

"ఒక కాయితము. రైల్వేకి సంబంధించి నది—తెచ్చిస్తాను" అని శకుంతల లోపలకి వెళ్ళి క్షణంలో తిరిగివచ్చి, యుగంధర్‌కి ఒక కవరు యిచ్చింది. రైల్వేస్టేషన్ లెఫ్టు లగేజ్ వారు యిచ్చిన రశీదు ఆ కవరులో వుంది. ఆ రశీదును పరీక్షగా చూస్తూ, "అమ్మా! ఈ రశీదు నేను తీసుకెళ్తాను" అన్నాడు యుగంధర్.

"తీసుకెళ్ళండి. మా వారు—"

"బతికే వున్నారనే అనుకొంటాను. మళ్ళీ వస్తాను" అని యుగంధర్ అక్కడనుంచి బయలుదేరాడు.

*   *   *

నాలిక ఎండిపోతోంది.ఆరు రోజులయింది-స్నానంచేసీ, గడ్డం గీసుకొనీ, బట్టలు మార్చు కొనీ. నిద్ర కూడా లేదు. అలా కునుకుపట్టి కళ్ళు మూసుకుపోతూ వుంటే మళ్ళీ వస్తారు.

"చెప్పు—ఎక్కడ పెట్టావు? బాంక్‌లో పెట్టిన పెట్టెలో చెత్త కాయితాలు తప్ప ఇంకేమీ లేవు."

"చెప్పను."

"అయితే యిలా నోరు ఎండి చస్తావు."

"సరే—"

రెండు మూడుసార్లు సూదులతో గుచ్చి హింసించారు. ఆ చిత్రహింసకి తను లొంగక పోయేటప్పటికి మానేశాడు.

"ఈరోజు ఆఖరిరోజు. చెప్పకపోయావా! నీ భార్య—పిల్లలు, చస్తారు. వాళ్ళ శవాలను చూపిస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు. కర్కశులు. అన్నంత పనీ చేస్తారు. తన భార్య పిల్లల ప్రాణాలను బలివ్వడమా? నిజం చెప్ప డమా. ఇతనొక్కడే కాదు, దేశంలో, ఎంతో మంది, ఒకనాటి దేశద్రోహులు ఈ నాటి దేశ నాయకులుగా చెలామణి అవుతూ, దేశాన్ని దోచుకొని ప్రజలను పీడిస్తున్నారు. చెప్పేస్తే-తన భార్య పిల్లల ప్రాణాలను రక్షించుకొనేం దుకు—తన స్థితిలో తన తండ్రి చలపతిరా వుండివుంటే ఏం చేసేవారో ఏమో! ఎవరో వస్తున్నారు. ఏం చే యా లి? చెప్పెయ్యాలి. చెప్పేసి—యీ నరకాన్నించి తప్పించు కోవాలి. తన భార్యా పిల్లలను రక్షించుకోవాలి.

*   *   *

లెఫ్టు లగ్గేజ్ కౌంటర్‌లో వున్న గుమాస్తా రాజుని సరిగా కూడా చూడలేదు. రశీదు తీసు కొని సంతకం పెట్టించుకొని ఒక బ్రీఫ్‌కేసు రాజుకు యిచ్చాడు.

*   *   *

"యస్ సార్. వెంటనే పంపిస్తాను" అని రిసీవర్ పెట్టేసి, ఐజి ఆఫ్ పోలీస్ తన పర్స నల్ అసిస్టెంటుని పిలిచి, "గోవర్ధనరావు పేర్న లెఫ్ట్ లగ్గేజ్ ఆఫీసులో రైల్వేస్టేషన్‌లో ఒక బ్రీఫ్‌కేసు వుందిట. దాన్ని వెంటనే తీసుకొని తనకి తెచ్చి యివ్వమని ముఖ్యమంత్రి ఫోను చేసి చెప్పారు. త్వరగా వెళ్ళు" అన్నాడు.

*   *   *

"మిస్టర్ రాజు! ఆగండి!"

కారు స్టార్టు చేస్తున్న రాజు, "ఆ! ఎవరు?" అడిగాడు.

"నేను ఐ.జి. పి.ఏ.ని. ఇదిగో నా ఐడెంటిఫి కేషన్ కార్డు. గోవర్ధనరావు బ్రీఫ్‌కేసు, మీరు అతని సంతకంపెట్టి తీసుకొన్నారు. దయచేసి ఆ బ్రీఫ్‌కేసు యిలా యివ్వండి" అన్నాడు ఐ. జి ఆఫ్ పోలీస్ పి. ఏ.

"ఇది మీకివ్వను. నేనే స్వయంగా ఐ. జి. ఆఫ్ పోలీసుకి తెచ్చి యిస్తాను," అన్నాడు రాజు.

"నాకు యిచ్చినా ఐ. జి.కి యిచ్చినా ఒకటే. వెంటనే ముఖ్యమంత్రికి యీ బ్రీఫ్‌కేసు అంద జేయాలి. యీ బ్రీఫ్‌కేసు ద్వారా గోవర్ధనరావు ఆచూకీ తెలుస్తుందని ముఖ్యమంత్రి కబురు పంపారు. మీరు ఆ బ్రీఫ్‌కేసు తక్షణం నా కివ్వకపోతే మిమ్మల్ని అరెస్టుచేసి—" అంటు న్నాడు అతను. ఆలోగా రాజు కారు స్టార్టుచేసి, స్పీడ్‌గా తోలుకు వెళ్ళిపోయాడు.

దరిదాపుల్లో వున్న ట్రాఫిక్ పోలీస్ ఇన్

స్పెక్టర్‌ని పిలిచి, "నేను ఐ. జి. పి.ఏ.ని. ఆ కారులో ఒక దొంగ బ్రీఫ్‌కేసు తీసుకొని పారి పోతున్నాడు. అతన్ని వెంబడించి పట్టుకొని, లాకప్‌లో పెట్టి ఆ బ్రీఫ్‌కేసుని తిన్నగా ముఖ్య మంత్రి యింటికి తీసుకురండి" అని ఆజ్ఞాపిం చాడు ఆ పోలీసు అధికారి.

ఒక జీపు—రెండు మోటార్ సైకిళ్ళు తనని వెంబడిస్తున్నాయి. పైగా వాళ్ళు పోలీసు సైరన్ వేసుకొని వస్తున్నారు. ఆ బ్రీఫ్‌కేసు వాళ్ళకి చిక్కకూడదు. ఆ దృఢనిశ్చయంతో రాజు కారు స్పీడు పెంచాడు. ట్రాఫిక్ రూల్స్ పాటించడంలేదు. అయినా వాళ్ళు తనని కలుసు కొంటారు. పట్టుకొంటారు. ఆలోగా—బ్రీఫ్ కేసు—ఏం జెయ్యాలి? ఆలోచిస్తున్నాడు రాజు.

* * *

ముఖ్యమంత్రిని గురించిన విశేషాలు, వివ రాలు, వున్న ఫైలు తీసి చదువుతున్నాడు యుగంధర్. ఒక పేరా పదే పదే చదివాడు. ముఖ్యమంత్రికి అంత మూఢ నమ్మకమా? కాసేపు ఆలోచించి, ఒక నిశ్చయానికి వచ్చి, ఆ ఫైలు అలుమారులో పెట్టేసి, లేచి వాచీ చూసుకొన్నాడు. ఏమయ్యాడు రాజు? స్టేషనుకి వెళ్ళిరావడానికి యింత ఆలస్యమవుతుందా? అంతలో టెలిఫోన్ మోగింది. "యస్ యుగంధర్ స్పీకింగ్" అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు హియర్! మిస్టర్ యుగంధర్ చట్టాన్ని మీరు యిలా బాహాటంగా వుల్లంఘిస్తారని నేను ఎన్నడూ అనుకోలేదు."

"నేను ఏం చేశాను యిన్‌స్పెక్టర్?"

"గోవర్ధనరావు, రైల్వేస్టేషన్ లెఫ్ట్ లగేజ్ రూమ్‌లో ఒక బ్రీఫ్‌కేసు పెట్టాడని, మీకు తెలిసినపుడు, ఆ కేసు యిన్వెస్టిగేటింగ్ ఆఫీసర్ అయిన నాకు మీరు వెంటనే తెలియజేయవలసింది. అలా చేయకుండా, రాజుని పంపి, గోవర్ధనరావు సంతకం ఫోర్జరీ చేయించి ఆ బ్రీఫ్‌కేసుని తీసుకురమ్మని చెప్పడం చట్ట విరుద్ధంకాదా? రాజు ఆ బ్రీఫ్‌కేసు తీసుకొని వెళ్ళుతున్నప్పుడు ఐ. జి. ఆఫ్ పోలీసు పి.ఏ. రాజుని అడ్డగించి ఆ బ్రీఫ్‌కేసు తన కివ్వమని రాజుని అడగగానే; మీ అసిస్టెంట్ రాజు ఆ బ్రీఫ్‌కేసు యివ్వకుండా కారులో పారిపోవడం నేరంకాదా! ఐయామ్ వెరీ సారీ మిస్టర్ యుగంధర్! రాజుని అరెస్టుచెయ్యమని—మిమ్మల్ని కూడా వెంటనే అరెస్టు చేయమని ముఖ్యమంత్రి ఆజ్ఞ యిచ్చారు. యివి ఎమర్జన్సీ రోజులని మీరు మరచిపోయారేమో! నేరం ఆరోపించవలసిన అవసరం కూడా లేదు. ఎంత కాలం అయినా మిమ్మల్ని డిటెన్షన్‌లో వుంచవచ్చు. వస్తున్నాను" అని స్వరాజ్యరావు టెలిఫోన్ పెట్టేశాడు.

యుగంధర్ లోలోన నవ్వుకున్నాడు. తనని అరెస్టు చేయడం స్వరాజ్యరావుకి యిష్టంలేదు. పై అధికారుల ఆజ్ఞలని పాటించకుండా వుండనూలేడు. అందుకే ముందుగా హెచ్చరించాడు. రాజు ఏమయ్యాడు? రాజు సమర్థుడు. పోలీసులకి చిక్కడు. ఆ బ్రీఫ్‌కేసు వాళ్ళకి యివ్వడు. ఆ ధైర్యంతోనే మేకప్ రూములోకి వెళ్ళాడు యుగంధర్.

* * *

ముఖ్యమంత్రి ప్రతాపరావు నమస్కారం చేసి, పాదాలని తాకి, కళ్ళకు అద్దుకొని, "స్వామీజీ! మీ రాకతో నా యిల్లు పావనం అయింది" అన్నాడు.

"శుభం! శుభం! నా పూర్తిపేరు స్వామి సిద్ధానంద సంపూర్ణానంద సంపూర్ణానందం. నన్ను నా శిష్యకోటి 'మహర్షి' అంటారు. పన్నెండేళ్ళపాటు హిమాలయాలలో తపస్సు చేసి, యిటీవలే దేశ సంచారం బయలుదేరాను. భగవంతుడిపట్ల భక్తి, భగవంతుడి అనుచరులపట్ల గౌరవము మీకు అపారంగా వున్నాయని తెలిసి యిక్కడికి వచ్చాను. మీ రాష్ట్రంలో నేను ఒక ఆశ్రమం—"

"మేము అదృష్టవంతులం. స్వామీజీ తమరు ఎక్కడ బస చేశారు?" అడిగాడు ముఖ్యమంత్రి.

"ఎక్కడా యింకా బస చేయలేదు. ఆకాశ

కోనలో స్నానంచేసి, కాలినడకన తిన్నగా యిక్కడికే వచ్చాను. రేపు, యిక్కడ మీ పేరున యీ రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా భగవంతుడు ప్రసాదించాలని ఒక యజ్ఞంచేయ సంకల్పించాను. మీ సహకారం—"

"ఇది నా భాగ్యం. ఏం కావాలో చెప్పండి. అన్ని ఏర్పాట్లు చేయిస్తాను" అన్నాడు ముఖ్యమంత్రి.

"సర్వదా భగవంతుడి కటాక్షం మీకు కలుగుగాక. ఏదీ! చెయ్యి జాపండి!"

ముఖ్యమంత్రి రెండు చేతులూ జోడించి జాపాడు.

స్వామి సిద్ధానంద కుడిచెయ్యి గుప్పిట బిగించి చేతివేళ్ళు నలిపాడు. ఆ చేతివేళ్ల మధ్య నుంచి విభూతి పడింది ముఖ్యమంత్రి చేతిలో. ఆ విభూతిని కళ్ళకద్దుకొని, నొసట రాసుకొని "మీకు మేడమీద గది—"

తల వూపాడు సిద్ధానందస్వామి.

*　　　*　　　*

పూనమల్లి వచ్చింది. లారీలు, బస్సులు, జనసమ్మర్దం. రాజు చటుక్కున కారు ఆపి, బ్రీఫ్‌కేస్‌తోసహా అరక్షణంలో కారులోంచి దిగేసి—జనంలో కలిసిపోయాడు. పోలీసు జీపు వచ్చేలోగా జనంతోపాటు ఎక్కేశాడు బస్సు.

ఇటువంటి పరిస్థితుల్లో అవసరం కలుగుతుందనే—రద్దీగా వుండే బజారు వీధిలో, ఒక చిన్న ఆఫీసు—తనకీ, యుగంధరుకీ, కాత్యాకీ తప్ప ఎవరికీ తెలియనిది ఏర్పరుచుకొన్నారు. రాజు రహస్యమైన ఆ ఆఫీసుకి వెళ్ళి, యుగంధర్‌కి ఫోన్ చేసాడు. యుగంధరు పలకలేదు. కాత్యా పలికింది.

"పట్ర—తాట్ర—పట్ర—రాట్ర—వుట్ర-యిట్రి—యిమ్ట్రీ—టిట్రీ—కిట్రీ—స్వాట్రి—మిట్రీ — సిట్రీ—ద్ధాట్రా — నట్రా—అంట్రా—దట్రా—పేట్రు — రుట్ర—తోట్ర—వెట్రి—ళ్ళాట్ర—రుట్రు. అట్ర—క్కట్ర—డిట్రి—కిట్రి— ఫోట్రా—నుట్రు—చెట్రి యిట్రి — మాట్ర — రుట్రు—పేట్రు — రుట్రా—తోట్రా."

అని కాత్యా టెలిఫోన్ పెట్టేసింది. అది చాలా సింపుల్ కోడ్. 'ట్ర' అక్షరం తీసేస్తే చాలు. రాజుకి అర్ధమయింది.

*　　　*　　　*

చీకటిపడింది. ముఖ్యమంత్రి ప్రతాపరావు స్వామిగారి గదికి వెళ్ళారు.

"స్వామీజీ! తమకి అన్ని సదుపాయాలు సరిగా వున్నాయా?" స్వామిగారు తల వూపారు.

"రేపు యజ్ఞానికి అన్ని ఏర్పాట్లు చేశాము."

"ధన్యవాద్" అంతలో టెలిఫోన్ మోగింది.

ముఖ్యమంత్రి రిసీవర్ తీస్తూ, "ఈ గదిలోంచి టెలిఫోన్ తీసేయమని చెప్పాను. స్వామిగారి దీక్షకు భంగం కలుగకూడదు. మర్చిపోయినట్లున్నారు" స్వామివారితో అని, "హల్లో! ఔను. అలాగా! అడుగుతాను" స్వామీజీవైపు తిరిగి, "స్వామీ? శంకర మఠానికి చెందిన ఒక సాధువు మీతో మాట్లాడాలిట" అన్నాడు ప్రతాపరావు.

"పేరు?"

"యోగిరాజా అని పేరు చెపుతున్నారు."

"యిట యివ్వండి!!" అని రిసీవర్ తీసుకొని, "శుభం! ఏం కావాలి? దర్శనమా? ఈ రాత్రా? వీలుకాదు. చెప్పండి యోగీ! ఆ! ఆ!" అయిదు నిమిషాలు అవతల మాటలు విని, రిసీవర్ పెట్టేసి, "రేపు యజ్ఞానానికి వస్తానని యోగిరాజా అర్థిస్తున్నాడు. రమ్మన్నాను."

"మీ దయ—" అన్నాడు ప్రతాపరావు.

స్వామీజీ కళ్ళు మూసుకొని, "ఓం! శాంతి స్వరూపిణీ—" అంటున్నాడు. ముఖ్యమంత్రి ప్రతాపరావు చప్పుడు చెయ్యకుండా గదిలోంచి వెళ్ళిపోయాడు.

o　　　o　　　o

గోవర్ధనరావు అతి కష్టంమీద కళ్ళు తెరిచాడు.

ఎదురుగా నిలుచున్న స్వామీజీని చూసి,

ఎవరు అని అడగబోయి, గొంతులోంచి మాట రాక అలా చూస్తూ వుండిపోయాడు.

"గోవర్ధనరావు! భయంలేదు. నిన్ను ఇక్కడ్నుంచి తప్పిస్తాను." అన్నాడు స్వామి.

గోవర్ధనరావు కళ్ళలో నీళ్ళు నిండాయి. నెమ్మదిగా తల విదిలించాడు. ఏదో చెప్పబోయి —చెప్పలేక వూపిరి తీసుకొని నోరు మూసుకున్నాడు. నోరు మూసుకుంటూ వూపిరి వదిలాడు. అదే ఆఖరు వూపిరి. గోవర్ధనరావు ప్రాణం వొదిలేశాడు. అతనికీ ఈ లోకానికి ఋణం తీరింది.

స్వామీజీ చకచకా గోవర్ధనరావుని పరీక్ష చేశాడు. దావాపు ఆరు రోజులుగా, తిండి-నీళ్లు నిద్రలేక, హింసలకి తట్టుకోలేక; శరీరంలో శక్తి నశించి ప్రాణం పోయిందని తెలుసుకున్నాడు.

"స్వామీజీ! చేతులు పైకెత్తి పెట్టండి!" అన్న మాటలు వినిపించాయి. స్వామీజీ చేతులు పైకెత్తి వెనక్కి తిరిగాడు. ముఖ్యమంత్రి పిస్తోలు స్వామీజీవైపు గురిపెట్టి తలుపుదగ్గిర నిలుచుని వున్నాడు. తలుపు మూసివుంది.

"మీరు ఈ గదిలోకి ఎందుకు వచ్చారు? అతను మీకేం చెప్పాడు?" అడిగాడు ముఖ్యమంత్రి ప్రతాపరావు.

స్వామీజీ నవ్వాడు. "మిస్టర్ ప్రతాపరావు! నా పేరు స్వామి సిద్ధానంద కాదు. నేను డిటెక్టివ్ యుగంధర్ని."

ప్రతాపరావు నిమిషంపాటు మౌనంగా వుండి, "అలాగా! గోవర్ధనరావు మరణించాడా?" అడిగాడు.

"ఔను. మీరే అతన్ని హత్య చేశారు." అన్నాడు యుగంధర్.

ముఖ్యమంత్రి పకపకనవ్వి, "అతన్నేకాదు. మిమ్మల్ని కూడా హత్య చేస్తాను. అంతేకాదు బ్రీఫ్‌కేస్ తీసుకొని పారిపోయిన మీ అసిస్టెంటు రాజునికూడా చంపిస్తా."

యుగంధర్ కూడా నవ్వాడు. "యిందాక నాతో టెలిఫోన్‌లో మాట్లాడిన యోగిరాజా ఎవరోకాదు నా అసిస్టెంటు రాజు. బ్రీఫ్‌కేసులో వున్నవన్నీ చూసేశాడు. రాజు విమానంలో బయలుదేరి ఢిల్లీకి వెళ్ళిపోయాడు. ఈపాటికి ఢిల్లీలో దిగి హోటల్లో వుండివుంటాడు. పొద్దున్న పదిగంటలలోపున నానించి కబురు రాకపోతే, పత్రికలవారిని—ఉన్నత పోలీసు వుద్యోగులిని పిలిచి. వారిముందు ఆ బ్రీఫ్ కేస్ తెరిచి, ఆ కాయితాలు, ఫోటోలు వాళ్ళకి యిచ్చేస్తాడు. నన్ను చంపినా మీకు శిక్ష తప్పదు—యింకో హత్య చేశారన్న ఆరోపణ తప్ప—"

"యుగంధర్! ఆ బ్రీఫ్‌కేసులో ఏముందో నిజంగా మీకు తెలుసా?" అడిగాడు ముఖ్యమంత్రి. యుగంధర్ తలవూపాడు.

"అయితే చెప్పండి" అడిగాడు ముఖ్యమంత్రి.

"గోవర్ధనరావు తాత చలపతిరావు డిప్యూటీ కలెక్టర్‌గా వున్న రోజుల్లో—" అంటూ ఒక వురుకున వెళ్ళి, ప్రతాపరావు చేతిలో వున్న పిస్తోలు కాలితో తన్నేసి, అతని రెండుచేతులు పట్టుకుని వెనక్కి మెలివేశాడు యుగంధర్. వృద్ధుడైన ప్రతాపరావుకి యుగంధర్‌తో కలియబడే శక్తిలేదు, ఆత్మధైర్యమూలేదు.

"గోవర్ధనరావు మిమ్మల్ని ఏం అడిగాడు?" యుగంధర్ ప్రశ్నించాడు.

"డబ్బిస్తానన్నాను—పెద్ద వుద్యోగం యిస్తానన్నాను—యింకా ఎన్నో ఆశలు చూపించాను. తనకి ఏమీవద్దని నన్ను రాజీనామాచేసి, రాజకీయాల్లోంచి విరమించుకోమనీ చెప్పాడు. తను చెప్పినట్టు నేను చేస్తే నా గతచరిత్ర వెల్లడి చెయ్యనని అన్నాడు. మొండిపట్టు పట్టాడు" చెప్పాడు ముఖ్యమంత్రి.

"గోవర్ధనరావు తాతగారు, రావు బహదూర్ శేషయ్యగారు, డిప్యూటీ కలెక్టర్‌గా వున్న రోజుల్లో, మీరు కాంగ్రెసులో వాలంటీరుగా; తర్వాత ఆలిండియా కాంగ్రెసు కమిటీ సభ్యులుగా వున్నారు. కాని, కాంగ్రెసుకీ; స్వాతంత్ర వుద్యమానికీ వెనకనించి గోతులు తీశారు. ఎప్పటికప్పుడు కాంగ్రెసు నాయకుల నిర్ణయాలు, ఆలోచనలు, మీరు రావు బహదూర్ శేషయ్యగారికి తెలియచేసేవారు. అంతేకాదు,

క్విట్ యిండియా వుద్యమం జరిగినపుడు, మీరు ఎందరో కాంగ్రెసు కార్యకర్తలని, దేశభక్తులనీ, బ్రిటిష్ అధికారులకి పట్టియిచ్చారు. అందుకు పారితోషికంగా, బ్రిటిష్ ప్రభుత్వం, మీకు డబ్బు యిచ్చింది. ఈ వివరాలన్నీ, రసీదులతో, ఫొటోలతో, వుత్తరాలతో సహా రావుబహదూర్ శేషయ్యగారి పెట్టెలో వున్నాయి. అవి చూసిన గోవర్ధనరావు వూరుకోలేక—మిమ్మల్ని రాజీనామా చెయ్యమన్నాడు.

గోవర్ధనరావు కోరినట్లు—ఆరోగ్యం సరిగా లేని కారణం చెప్పి మీరు రాజీనామా చేసి వుండవలసింది. కాని ఎలా చేస్తారు! కీర్తికి పదవులకి అలవాటుపడ్డారు. ప్రతాపరావుగారూ! నేను వెళ్ళిపోతున్నాను. రేపు పదిగంటలకి మీ గతాన్ని గురించి సాక్ష్యాలతోసహా ప్రపంచానికి వెల్లడి చేస్తాను. ఆలోగా మీరేం చేస్తారో నిర్ణయించుకోండి. మరొక విషయం జ్ఞాపకం చేస్తున్నాను—గోవర్ధనరావు భార్య పిల్లలు ఏ ఆధారమూ లేనివాళ్ళయ్యారు. వాళ్ళకి మీరు తీరని అపచారము చేశారు. వెళ్తాను" అని యుగంధర్ గదిలోంచి వెళ్ళిపోయాడు.

o o o

ఎవరికీ తెలియని రహస్యమైన ఆఫీసు గదిలో రాజు, యుగంధర్ కూర్చొని వున్నారు.

యింకా సూర్యోదయం కాలేదు.

రాజు సిగరెట్ వెలిగించి, "దారుణమైన హత్య చేసిన ఆ ప్రతాపరావుని పట్టుకొని, పోలీసు—" అంటున్నాడు.

"తొందరపడక రాజూ!" చెప్పాడు యుగంధర్!

o o o

మర్నాడు పొద్దున వెలువడిన దినపత్రికలో పతాక శీర్షిక:

ముఖ్యమంత్రి ప్రతాపరావు
అకాల మరణం!

డబ్బయిరెండు సంవత్సరాల వయస్సు గల రాష్ట్రముఖ్యమంత్రి ప్రతాపరావు రాత్రి రెండు మూడు గంటల మధ్య గుండెపోటుతో మరణించారని తెలియజేయడానికి విచారిస్తున్నాము.

యుగంధర్ ఆ తరువాత వివరాలు చదువలేదు. పత్రిక మిగతా పేజీలు తిరగవేశాడు. ఒకచోట చిన్న అక్షరాలతో, "గత వారం రోజులుగా అదృశ్యమైన స్కూలుటీచరు గోవర్ధనరావు శవం కృష్ణా నది ఒడ్డున కనపడింది. పోలీసులు శవాన్ని శవ పరీక్షకు పంపారు—"

మిగతా వివరాలు చదవలేదు యుగంధర్. పత్రిక రాజుకు యిచ్చి, "తను చేసిన నేరానికి తనే శిక్ష విధించుకొన్నాడు ముఖ్యమంత్రి ప్రతాపరావు. ప్రతాపరావు గతాన్ని గురించిన వివరాలు వెల్లడిచేయడంవల్ల ప్రజలలో నాయకులమీద విశ్వాసం నశిస్తుంది. దేశ క్షేమానికి యిది మంచిది కాదు. అందువల్ల ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రతాపరావుకి అవకాశం యిచ్చాను" అన్నాడు యుగంధర్ రాజుతో.

"పాపం—శకుంతల—" అంటున్నాడు రాజు.

"ముఖ్యమంత్రి యింటికి ఫోన్‌చేసి పి.ఏ.ను పిలు" అన్నాడు యుగంధర్.

"యస్—నేను డిటెక్టివ్ యుగంధర్‌ని. చదివాను. చాలా విచారించాను, ముఖ్యమంత్రి ప్రతాపరావుగారి వీలునామా ఏదైనా వ్రాశారా?" అడిగాడు.

"అవును. నిన్నరాత్రి పన్నెండు గంటలకి నన్ను తన గదికి రమ్మని తన వీలునామాలో చేసిన ఒక మార్పుకి సాక్షి సంతకం పెట్టమన్నారు ముఖ్యమంత్రి. పెట్టాను. గోవర్ధనరావుగారి కుటుంబానికి తన ఆస్తిలో సహం భాగం, అంటే దాదాపు నాలుగులక్షల రూపాయలు వారి పేర్న వ్రాశారు" చెప్పాడు పి. ఏ.

"అలాగా—" అని యుగంధర్ రిసీవర్ పెట్టేసి, "రాజూ. గోవర్ధనరావు ప్రాణాన్ని రక్షించలేకపోయాము కాని ఆ కుటుంబం వీధులపాలు కాకుండా" అని, కుర్చీలోంచి లేచి "నేను వెళ్ళి శకుంతలాదేవిని చూడను. చూడలేను. నువ్వు వెళ్ళి చెప్పు రాజు" అన్నాడు యుగంధర్ గుండెబరువుతో. □